జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త. కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com

www.jatheeyavaartha.com

# జాతీయ వార్త

తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761



epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com



శనివారం | 23-8-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 434 పేజీలు: 4 వెల : రూ.7


## పోలీసులు అవినీతికి పాల్పడితే.. బదిలీ వేటు

* పోలీసులు, అధికారులు తీరు మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు * కొందరిపై ఫిర్యాదులు ఉన్నాయి * శిక్షలు శాతం పెరిగేలా కేసుల్లో దర్యాప్తు ఉండాలి * మహిళ భద్రత, బాధితులకు తక్షణ న్యాయం అందించడమే పోలీసుల విధి * విశాఖపట్టణం రేంజ్ డీఐజీ గోపినాథ్ జట్టి * గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన పెంచాలి:కలెక్టర్ *నూతన చట్టాలపై తెలుసుకోవాలి:జిల్లా జడ్జి * అన్ని శాఖల సమన్వయంతో నేర నియంత్రణ:ఎస్పీ



**శ్రీకాకుళం, ఆగస్టు 22(వార్త):** విధి నిర్వహణలో అవినీతి, ఆరోపణలకు పాల్పడిన పోలీసు అధికారులను బదిలీతోపాటు, వ్యవహార శైలి మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలు తప్పవని విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి అన్నారు. జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల ఉన్నత అధికారులతో శుక్రవారం శ్రీకాకుళం నగరంలోని స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో అర్ధ వార్షిక నేర సమీక్ష, సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు. గోపీనాథ్ జట్టి మాట్లాడుతూ మహిళ భద్రత, బాధితులకు తక్షణ న్యాయం అందించడమే పోలీసుల మొదటి విధి అని తెలిపారు. జిల్లాలో నేరాలు నియంత్రణకు పోలీసు అధికారులు ప్రత్యేక కార్యచరణతో పటిష్టమైన చర్యలు చేపట్టాలన్నారు. సాంకేతిక శాస్త్రీయ కోణంలో కేసులు దర్యాప్తు చేపట్టి శిక్షల శాతం పెరిగాల కేసులు దర్యాప్తు చేయాలని సూచించారు. క్రైమ్ అగైనెస్ట్ ఉమెన్, మాదకద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాలు నివారణ, సైబర్ మోసాలు నియంత్రణకు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులు పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి త్వరితగతిన పరిష్కారం చూపి న్యాయం అందించాలని అప్పుడే పోలీస్ శాఖ కీర్తి పెరుగుతుందన్నారు. గంజాయి వంటి మత్తు పదార్థాలు అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు. ప్రాపర్టీ నేరాలు నియంత్రణకు రాత్రి వేళలో గస్తీలు పటిష్టంగా తిరగాలన్నారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రతి శనివారం పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలు ను పోలీసు తోపాటు, బాల బాలికలు సంరక్షణ, చైల్డ్ లైన్, రెవెన్యూ,హెల్త్, మెడికల్, విద్యా, ఇతర విభాగాలు అధికారులు సందర్శించి విద్యార్థులతో మమేకమవుతూ వారి అభిప్రాయాలు తెలుసుకునే కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అధికారులు 'గుడ్ టచ్, బ్యాడ్ టచ్' బాల్య వివాహాలు, కిడ్నాప్, ఈవీటీజింగ్ వంటి జాగ్రత్తలు, మాదక ద్రవ్యాలు వలన కలిగే అనర్థాలు, ఫోక్సో వంటి చట్టాలు, డయల్ 112,1091,1098, 181,1930,1972,శక్తి యాప్ వంటివి అవసరమైన అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల భద్రత, జాగ్రత్తల కోసం విలువైన, ముఖ్యమైన సందేశాన్ని అందించాలని, సంబధిత అంశాలు పై పోస్టర్, బోర్డు ప్రకటనలు ద్వారా క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించే దిశగా సంబధిత విభాగాల అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా మాట్లాడుతు కేసులు దర్యాప్తులో ఎదురయ్యే లీగల్ సమస్యలు, నేర ప్రవృత్తి, నేర తరహా వంటి పలు అంశాలపై పబ్లిక్ ప్రాసిక్యూటర్‌లతో చర్చించాలన్నారు. నూతన చట్టాలపై అవగాహన అవసరమని, చట్టాలు అవగాహన పై నిపుణులతో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి మాట్లాడుతూ నేరాల నివారణకు తీసుకున్న పటిష్ఠమైన చర్యలతో నేరాలు తగ్గుమఖం పట్టాయని తెలిపారు. జిల్లాలోని పోలీస్ శాఖకు సంబంధించి అన్ని శాఖల సమన్వయంతో నేర నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టి నేర రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల అక్రమ రవాణా, నిల్వలపై నిఘా పెట్టి అధిక కేసులు నమోదు చేయగలుగుతున్నామని తెలిపారు. మహిళ భద్రతకు నారీ శక్తి అనే కార్యక్రమం ద్వారా విస్తృతంగా గ్రామస్థాయిలోనూ అవగాహన కల్పిస్తున్నామన్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న పొదలు తొలగించి, ఇసుక డ్రమ్స్, రేడియం స్టిక్కర్స్ ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు ఎస్పీలు కెవి రమణ, పి.శ్రీనివాసరావు, శ్రీకాకుళం టౌన్ డిఎస్పీ వివేకానంద, ఎస్బి సిఐ ఇమ్మన్యుల్ రాజు, వివిధ శాఖల అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులు పాల్గొన్నారు.






## గణేష్ ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరి

* మండపాల ఏర్పాటుకు చలానాలు చెల్లించనక్కర్లేదు * శాంతియుతంగా నిర్వహించుకోండి * ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి


**శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 22 (వార్త):** వినాయక చవితి పండుగ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసు కొనే గణేష్ పందిళ్ళు, మండపాలు ఏర్పాటుకు తప్పనిసరిగా ఆన్లైన్‌లో అనుమతులు పొందాలని జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి తెలిపారు. గణేష్ ఉత్సవాలు నిర్వహించబోయే నిర్వాహ కులు ముందుగా ఒక కమిటీగా ఏర్పడి, ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సింగిల్ విండో విధానంతో https://ganeshutsav.net క్లిక్ చేసి, నిర్దేశించిన అనుమతులు పొందాలన్నారు. సింగిల్ విండో విధా నంతో ప్రజలు సులభంగా గణేష్ ఉత్స వాల నిర్వహణ, మండపాల ఏర్పాటు, ఊరేగింపులు, నిమజ్జనానికి అను మతులు పొందవచ్చునన్నారు. మండ పాల ఏర్పాటుకు ఎటువంటి చలానాలు చెల్లించనవసరం లేదని తెలిపారు. గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా ఎటువంటి అల్లర్లు, ఘర్షణలకు తావు లేకుండా నిర్వహించుకోవడానికి, పోలీ సు శాఖ జారీ చేసిన నియమ నిబం ధనలు పాటించి పోలీసు శాఖకు సహ కరించాలని ఎస్పీ కోరారు.


## మూగ రోదన



**మందస, ఆగస్టు 22(వార్త):** నిబంధనలకు విరుద్ధంగా మూగ జీవుల రవాణా కొనసాగుతోంది. నిత్యం పోలీసులు దాడులు చేస్తున్నా కొందరు బరి తెగిస్తున్నారు. పశువులను వ్యానుల్లో కుక్కేసి, వాటికి ఊపిరాడకుండా చేసి మానవత్వం లేకుండా తరలిస్తూ క్యాష్ చేసుకుంటున్నారు. సంపాదనేపై ధ్యాసే తప్ప మూగజీవాల రోదనను పట్టించుకోవడం లేదు. మందస మండలంలోని కొర్రాయి గేట్ జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద పశువుల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఓ లగేజీ వాహనాన్ని ఎస్ఐ కృష్ణప్రసాద్ సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు జాతీయ రహదారిపై తనిఖీలు నిర్వహిస్తుండగా పశువులను తరలిస్తున్న వాహనం పట్టుబడింది. వాహనంలో 16 గేదెలను అత్యంత దారుణంగా వాహనంలో కుక్కి, ఊపిరి కూడా ఆడని పరిస్థితిలో రవాణా చేస్తున్నారు. వాహనాన్ని మందస పోలీస్‌స్టేషన్‌కు, పశువులను గోశాలకు తరలించారు. మందస ఎస్ఐ ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కాగా, నిత్యం జాతీయ రహదారి మీదుగా ఇతర ప్రాంతాలకు పశువులను కొందరు కబేళాకు తరలిస్తున్నారు. ఆయా సంతల్లో వాటిని కొనుగోలు చేసి, ఎవరికీ అనుమానం రాకుండా పశువులను నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రాన్ని దాటించేస్తున్నారు.

## చేపల చెరువుల్లో.. కోళ్ల వ్యర్థాలు






* ప్రజారోగ్యంతో చెలగాటం *వ్యాధుల బారిన ప్రజలు * కళ్లు మూసుకున్న అధికారులు * కలుషిత మవుతున్న చెరువులు *వెల్లువెత్తుతున్న విమర్శలు

**సరుబుజ్జిలి, ఆగస్టు 22 (వార్త):** తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు సాధించాలన్న ఉద్దేశంతో చేపల చెరువుల యజమానులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన కోడిగుడ్లు, కోడి పేగులు, ఈకలు, కుళ్లిన మాంసం చేపలకు ఆహారంగా వేస్తున్నారు. ఈ చేపలను ప్రజలు తినడం వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. చేపల చెరువుల నుంచి వస్తున్న దుర్గంధంతో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో పడి చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. సరుబుజ్జిలి మండలంలోని ఇసకల పాలెం గ్రామానికి చెందిన కొందరు చెరువుల్లో చేపల పెంపకం చేస్తున్నారు. చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలను వేస్తున్నారు. సాధారణ మేత వల్ల చేపలు నెలకు అర కేజీ నుంచి కేజీ పెరిగితే, కోళ్ల వ్యర్థాలు తిన్న చేపలు మరింత బరువు పెరుగుతున్నాయి. సాధారణ మేతతో పోలిస్తే కోళ్ల వ్యర్థాలు తక్కువ ధరకు వస్తుండటంతో కొందరు చేపల చెరువుల యజమానులు వీటినే వినియోగిస్తున్నారు. ఆమదాలవలస పట్టణంలోని చికెన్ షాపుల నుంచి వ్యర్థాలను సేకరించి గొర్రెల సంత వద్ద నిల్వ ఉంచుతున్నారు. అక్కడి నుంచి డ్రమ్ములలో చికెన్ వ్యర్థాలను తీసుకొని భారీ వాహనాల ద్వారా చేపల చెరువు వద్దకు చేరవేస్తున్నారు. పట్టపగలే కోళ్ల వ్యర్థాల రవాణా జరుగుతున్నా అధికారులు పట్టించుకోక పోవడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. కోళ్ల వ్యర్థాలు చేపలకు మేతగా వేయడాన్ని నిషేధిస్తూ 2016లో ప్రభుత్వం జీవో నంబర్ 56ను జారీ చేసింది. ఈ జీవోను అమలు చేసేందుకు మండల స్థాయిలో తహసీల్దార్, మత్స్య అభివృద్ధి అధికారి (ఎఫ్‌డీవో), ఎస్ఐ, వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లతో, టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేశారు. పట్టుబడిన వ్యర్థాలను నాశనం చేయడంతోపాటు డ్రైవర్ లైసెన్స్ రద్దు, వ్యర్థాలతో సాగు చేస్తున్న చేపల చెరువుల రిజిస్ట్రేషన్ రద్దు వంటి చర్యలను టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అమలు చేయాల్సి ఉంది. అయితే మండలంలో చేపలకు మేతగా కోళ్ల వ్యర్థాలు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం







# సేవాధీరుడు... సూర శ్రీనివాసుడు

*** సామాన్యుడి నుంచి సేవకుడిగా... * సేవల్లో ఘనాపాటి... లేరు సాటి * నిరంతర శ్రామికుడు- ప్రజాసేవకుడు * స్నేహశీలి, సౌమ్యుడిగా ప్రజల మనసుల్లో ముద్ర * ఎస్ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా సేవలు**

**శ్రీకాకుళం, ఆగస్టు 22 (వార్త):** ఆయనో అలుపెరగని యోధుడు.. నిస్వార్థ ప్రజాసేవకుడు ... పేదల మనసుల్లో గుడి కట్టుకున్న భగవంతుడు.. సేవ చేయడమే తప్ప ఫలితమాసించే వ్యక్తి కాదు... కష్టాల్లో ఉంటాడు తోడు... అతడే సూర శ్రీనివాసరావు. కరోనా రక్కసి ఊరు.. వాడను మింగిస్తున్న వేళ... మానవత్వం... దాతృత్వం.... సేవాతత్వం వంటి లక్షణాలు మనుషుల నుంచి మాయమవుతున్న వేళ.. నేనున్నానంటూ ముందుకు వచ్చారు. ఏకకాలంలో మానవత్వంతో నిండి మనసుతో సేవాతత్పరతను కలిగి దాతృత్వం వైపు అడుగులు వేశాడు. కరోనా బాధితులకు, వారి సహాయులకు ఆహారం అందించి వారి పాలిట అన్నార్తుడయ్యాడు... పనుల్లేక అర్ధాకలితో అలమటిస్తున్న నిరుపేదల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందజేసి వారి పాలిట ఆరాధ్యుడయ్యాడు. లాక్ డౌన్‌లో ఇబ్బందులు పడిన రోజువారి కూలీలకు, ప్రయివేటు పాఠశాలల సిబ్బందికి, సినిమా హాల్ కార్మికులకు, విశ్వ బ్రాహ్మణ, జర్నలిస్టులకు, పేద కళాకారులకు వేలాదిగా నిత్యవసర సరుకులను పంపిణి చేసి వారి పాలిట ఆపద్భాంధవుడయ్యాడు.... రోగులకు, మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేసి వారికి సహాయకుడయ్యాడు... సకాలంలోనే విద్య, వైద్య, జైలు, ఆధ్యాత్మికత, క్రీడలు ఇలా అన్ని రంగాల్లోనూ తన సేవలను విస్తృతం చేశాడు.. ఇలా అన్నార్తుడిగా, ఆరాధ్యుడిగా, సేవకుడిగా, నాయకుడిగా వారివారి ప్రజల మనసుల్లో తన స్థానం పదిలం చేసుకున్నాడు సూర శ్రీనివాసుడు.. తన పుట్టిన రోజున దీని పేరులో ట్రస్టు ప్రారంభించి అనతి కాలంలోనే ప్రజలకు అనేక సేవలందించి కలెక్టరు నుంచి సామాన్యుడి వరకు సుపరిచితుడయ్యాడు సూర శ్రీనివాసరావు. తాను చేసిన సేవలకు గానూ డాక్టరేట్ పట్టాను కూడా అందుకున్నారు.





## వ్యవసాయం నుంచి వ్యాపారం వైపు...

జిల్లాలోని ఎచ్చెర్ల మండలం కుశాలపురం గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో జన్మించిన సూర శ్రీనివాస ఎచ్చెర్ల, శ్రీకాకుళం నగరాల్లో వ్యాపార రంగంలో అంచెలంచెలుగా ఎదుగుతూ వచ్చారు. శ్రమయే పెట్టుబడి అయితే విజయం నీకు బానిస అవుతుందని ఓ మహనీయుడు చెప్పిన మాట సూర శ్రీనివాసరావులో స్ఫూర్తిని నింపింది. ఆ మాటే ఆయనను బాటగా మలిచింది. సిక్కోలు జిల్లాలో ఎందరో లక్షలాధికారులు, కోటీశ్వరులు ఉన్నా మానవత్వం, దాతృత్వం ఉన్న మనిషిగా శ్రీనివాసరావు మాత్రమే జనం ముందుకొచ్చి కష్టకాలంలో ఉన్నవారిని ఆదుకొనేందుకు సిద్ధమవుతుంటారు. కరోనా కాలంలో అందరివాడిగా మన్ననలు అందుకున్న వ్యక్తి శ్రీనివాస్ ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపిలు, ఉన్నతాధికారులు, మేధావులు, సామాన్య పౌరులందరికీ ఇప్పుడు సుపరిచితుడు ఈ శ్రీనివాసుడు. అందరి ప్రశంసలు అందుకున్న వ్యక్తి కూడా ఈయనే కుశాలపురం గ్రామంలో రైతు కుటుంబంలో 1984 ఆగస్టు 23న జన్మించిన సూర శ్రీనివాసరావు తల్లిదండ్రులు వైకుంఠమ్మ గన్నయ్యలకు ముగ్గురు పుత్రులు, నలుగురు పుత్రికలతో సహా 8వ సంతానమైన శ్రీనివాసరావు డిగ్రీ పూర్తి చేసి అనంతరం వ్యాపారరంగంలో ఇంతంతింతై వటుడింతై చందంగా ఎదిగారు. ఒకవైపు వ్యాపారం చేస్తూనే మరోవైపు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తూ వచ్చారు. రెండు రంగాల్లోనూ ఈయనకంటూ ప్రత్యేక స్థానం ఉందని నిరూపించుకోగలుగుతున్నారు.

## పారిశ్రామికవేత్త... సామాజికవేత్త..

సమాజంలో పదిమందికి సహాయపడాలంటే డబ్బు ఖచ్చితంగా ఉండాలి. ఒక్క డబ్బుంటే సరిపోదు పది మందికి సహాయం చేయాలన్న తపన కూడా ఉండాలి. వ్యవసాయ రంగం నుంచి వచ్చిన శ్రీనివాసరావు పారిశ్రామికవేత్తగా - క్రమం క్రమంగా ఎదుగుతూ తాను సంపాదించిన డబ్బు జనానికి కూడా ఉపయోగపడాలన్న ఉద్దేశ్యంతో సామాజికవేత్తగా కూడా ఎదిగారు.



## పెద్దల మన్ననలు..

కష్టపడి పనిచేయడమే కాదు.. ఇష్టపడి పనిచేయడం సూర శ్రీనివాస్‌కు సహజ లక్షణం. తాను చేయాలన్నది ఏదైనా ఖచ్చితంగా చేసి తీరుతారు. వ్యాపారం, వ్యవహారంలో కూడా ఈయనంటేనే ఎందరికో నమ్మకం. పారిశ్రామిక వేత్తగా, సామాజికవేత్తగా ఎదుగుతున్న క్రమంలో సూర శ్రీనివాసరావు అత్యున్నత స్థాయిలో ఉండే నేతలు మొదలు పార్టీలకతీతంగా నాయకులు, పౌర సంఘాలు నుంచి మన్ననలు అందుకుంటూనే ఉన్నారు. ఇక ప్రముఖ సంస్థల నుంచి కూడా సూర శ్రీనివాసరావు అందుకున్న అవార్డులు, సన్మానాల సంఖ్య తక్కువేమీ కాదు.

## ఆలయాల నిర్మాణం... పునర్నిర్మాణంలో...

వ్యాపార రంగంలో తాను సంపాదించే డబ్బులో కొంతమేరకు దేవుడికి, మరికొంత మేరకు దేవుడిలాంటి మనిషికి ఇవ్వాలని శ్రీనివాస్ తపన పడుతూ ఉంటారు. దశాబ్దకాలంగా జిల్లాలో ఎన్నో దేవాలయాల నిర్మాణంలోనూ, పలు దేవాలయాల పునర్నిర్మాణంలోనూ ప్రముఖమైన పాత్ర ఈయన పోషించారు.




## సాయమందించే హస్తం...

కోవిడ్ కాలంలో ఇళ్లల నుంచి బయట చ్చేందుకు జనం భయపడేవారు. ఆసుపత్రుల్లో వందలాది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. ఎన్ని కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తొలివిడత కోవిడ్ సమయంలోనే జనానికి ఆదుకోవాలని శ్రీనివాస్ కు అనిపించింది. ఆలోచన వచ్చిందే తడవుగా మూడు విడతల కోవిడ్ సమయంలోనూ బాధిత జనానికి బాసటగా నిలిచారు. లాక్‌డౌన్ రెండు దశల్లో శ్రీనివాస్ చేపట్టిన సేవా కార్యక్రమాలు వేలాది మంది బాధిత జనానికి ప్రయోజనం చేకురాయనడంలో సందేహం లేదు. కోవిడ్ సమయంలో శ్రీనివాస్ ఆదుకొనేతత్వం జిల్లా వ్యాప్తంగా ఎంతో గుర్తింపును, గౌరవాన్ని తీసుకొచ్చేలా హృదయం చేసింది. మానవతా అంటే శ్రీనివాసే అని జనం కూడా ప్రశంసిస్తూ వచ్చారు. రాష్ట్రస్థాయి ప్రముఖ నేతలు, ఉన్నతాధికారుల ప్రశంసలతో పాటు ప్రముఖ సంస్థల నుంచి పురస్కారాలు అందుకున్నారు. 41 రోజుల పాటు కోవిత్ బాధితులకు పెద్ద ఎత్తున ఆహారం సరఫరా చేశారు. ప్రతీ ఏడాది పరీక్ష సమయంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అట్టలు, పెన్నులు, పరీక్షా సామగ్రి అందజేస్తున్నారు.




## ఆయన సేవలు వెంట ఆమె

సంపాదించే పురుషులు విపరీతంగా ఖర్చు చేస్తుంటారు. మహిళలు మాత్రం పొదుపు చేయడానికి ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. సూర శ్రీనివాస్ సమాజం కోసం ఏదో చేయాలన్న తపన పడుతున్నప్పుడు స్పందించే మొట్టమొదటి వ్యక్తి ఆయన సతీమణి సరితారాణి. జిల్లాలోని అనేక దేవాలయాలు, పలు పాఠశాలల్లో విగ్రహాల ఏర్పాటులో ఆయన సతీమణి సరితారాణి సహకారం ఎంతో ఉంది. మంచి కోసం ఎంతైనా ఖర్చు చేయడం తప్పులేదని అది ఉపయోగిస్తే అంతకంటే కావాల్సింది ఏమీ ఉండదని ఆమె భావిస్తూ ఉంటారు. 2015లో ఏప్రిల్ 2న కింతలి గ్రామానికి చెందిన త్రినాథరావు, హైమావతిల ఏకైక కుమార్తె సరితారాణితో వివాహం అయిన నాటి నుంచి ఇటు వ్యాపార రంగంలోనూ, ఇటు సేవా రంగంలోనూ సూర శ్రీనివాస్ దూసుకుపోతున్నారు. తన భర్త చేసే సామాజిక సేవా కార్యక్రమాలు తమ పిల్లలు జ్యోతిప్రియ, జస్మితకు పెద్దల దీవెనలుగా ఆమె భావిస్తూ ఉంటారు. సమాజం కోసం చేసిన ఏ ఒక్క సహాయం వృథా కాదని ఆమె బలంగా నమ్ముతారు. పేద విద్యార్థుల సహాయంలో గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన వారికి పేదరికం గురించి ఎక్కువగా తెలుస్తోంది. అలా గ్రామీణ నేపథ్యం ఉన్న సూర శ్రీనివాస్ చదువుకున్న రోజుల్లో సమస్యల్లో ఉన్న పేదవారిని చూసి తపించేపోయేవారు. వారి కోసం ఏదో చేయాలన్న తపన ఆయనకు అప్పటి నుంచే ఉండేది. చదువు పూర్తయి వ్యాపార రంగంలోకి వచ్చాక తన సంపాదనలో పేద విద్యార్థులను చదివించేందుకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రతీ ఏటా పుస్తకాలు, యూనిఫారాలు అందజేయడంలో సూర శ్రీనివాస్ అందిస్తూ ఉంటారు. పేదరికం వల్ల ఉన్నత విద్యకు అవకాశం లేని ఎందరికో ఆర్థికంగా ఆయన సహాయం అందించేవారు. దశాబ్దకాలంగా ఈయనకి ఆధ్యాత్మిక, సామాజిక, విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యతనిస్తూ పేదలకు సహాయం చేస్తూనే ఉన్నారు... ప్రతీ సేవలోనూ ఆయన వెంట ఆమె ఉన్నారు. అందుకే సరితారాణి తన సతీమణి అనడం కన్నా సహధర్మచారిణి అనేందుకే ఇష్టపడతానని సూర శ్రీనివాస్ చిరునవ్వులు చిందించారు.







జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**పలాస, ఆగస్టు 22 (వార్త):** పలాస డాక్టర్ వి.కణితీస్ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఉన్న మిగులు సీట్ల ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ పైల జవహర్ కోరారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను అడ్మిషన్ల కొరకు మిగిలి ఉన్న సీట్లకు (3వ విడత) దరఖాస్తులు 20 తేదీ నుండి 26-08-2025 తేదీ వరకు, విద్యార్థులు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకుని అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కొరకు ఆగస్టు 26వ తేదీ లోపల రావాలని ప్రిన్సిపాల్ పైల జవహర్ కోరారు. వెరిఫికేషన్ పూర్తయిన వారు 29-08-2025వ తేదీన కౌన్సిలింగ్‌కు తప్పకుండా హాజరు కావాలని ప్రిన్సిపల్ ఓ ప్రకటనలో తెలియజేశారు. ఐటిఐ కి సంబంధించి వివిధ ట్రేడ్లలో "కోపా ట్రేడ్"కు మహిళలకు ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుందని దీనిపై ఎక్కువ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యాజమాన్యం తెలియజేశారు.



## కొత్తూరులో టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ పర్యవేక్షణ

**కొత్తూరు, ఆగస్టు 22 (వార్త):** కొత్తూరు పంచాయతీలో ఇటీవల ఏర్పాటు చేసిన టైలరింగ్ ట్రైనింగ్ సెంటర్ను శుక్రవారం జిల్లా బీసీ కార్పొరేషన్ కో-ఆర్డినేటర్ మెట్ట చంద్రశేఖర్ తో పాటు వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వర ప్రసాద్‌రావు సందర్శించారు. ఈ సందర్భంగా తులసీ వర ప్రసాద్ రావు మాట్లాడుతూ, మొదటి బ్యాచ్ శ్రద్ధగా శిక్షణ పూర్తిచేసిందని, తదుపరి బ్యాచ్ ఎప్పుడు ప్రారంభమవుతుందో కోఆర్డినేటర్ గారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే ట్రైనింగ్ పూర్తి చేసిన మహిళలకు కుట్టు మిషన్లు త్వరితగతిన అందజేయాలని కోరారు. అంతేకాకుండా, టైలరింగ్తో పాటు మగ్గం వర్క్ వంటి మరిన్ని వృత్తి ఆధారిత శిక్షణలు ఇవ్వాలని ప్రభుత్వ అధికారులను అభ్యర్థించారు. మహిళల స్వావలంబనకు, గ్రామీణ అభివృద్ధికి ఇలాంటి శిక్షణా కార్యక్రమాలు మరింత ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. మండల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని తులసీవర ప్రసాద్ రావు హామీ ఇచ్చారు.

## కొత్తూరు మండల అభివృద్ధికి వినతి

**కొత్తూరు, ఆగస్టు 22 (వార్త):** కొత్తూరు గ్రామనికి వచ్చిన ఏపీ జెన్‌కో ఎండీ చక్రధరరావుని మండల వైస్ ఎంపీపీ లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు మర్యాద పూర్వకంగా కలిసి కొత్తూరు మండలంలోని పలు సమస్యలను వినిపించారు. జిల్లా అభివృద్ధి దిశగా పాతపట్నం నియోజకవర్గంలో థర్మల్ విద్యుత్ ప్రాజెక్టును స్థాపించవలసిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు. 32,000 కోట్ల రూపాయల వ్యయంతో ఏర్పడే ఈ ప్రాజెక్టుకు అవసరమైన 2,000 ఎకరాల భూమిని సమకూర్చే సదుపాయం ఉందని ఆయన వివరించారు. ఈ ప్రాజెక్టు అమలులోకి వస్తే పాతపట్నం నియోజకవర్గ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించడం తో పాటు ప్రజలకు ఉపాధి కల్పన జరుగుతుందని ఆయన తెలిపారు. కొత్తూరు మండలంలోని మాసింగి గ్రామంలో 2023లో శంకుస్థాపన జరిగిన 132/33 కేవీ ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ ఇప్పటివరకు పూర్తి కాలేదని, వెంటనే నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని కోరారు. ఈ సబ్‌స్టేషన్ ప్రతిష్టాత్మకంగా పూర్తి అయితే, పాతపట్నం నియోజకవర్గంలోని గిరిజన గ్రామాల వరకు ఏ అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా అవుతుందని ఆయన సూచించారు. దీనిపై ప్రతిస్పందించిన ఎండీ చక్రధరరావు ఈ అంశాలను సానుకూలంగా పరిగణించి త్వరితగతిన పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ద్రవ జీవామృతం తయారీపై అవగాహన

**కొత్తూరు, ఆగస్టు 22 (వార్త):** మహసింగిగూడ గిరిజన గ్రామంలో సహజ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ క్వాలిటీ ద్రవ జీవామృతం 200 లీటర్లు తయారీపై జిల్లా ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ మేనేజర్ పూజారి సత్యనారాయణ ఆదేశాల మేరకు ఎంటీ సూర్యనారాయణ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డివిజనల్ ఎంటీ సూర్యనారాయణ, యూనిట్ ఇన్చార్జి చిన్నమ్మి, ఐసీఆర్పీ మొఖలింగం, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## బాధ్యతగా పనిచేస్తా
### ఏఎంసీ డైరెక్టర్ చింతల ప్రశాంత్




**మెళియాపుట్టి, ఆగస్ట్ 22 (వార్త):** పాతపట్నం మార్కెట్ కమిటీలో మెళియాపుట్టి మండలం జనసేన పార్టీ నుంచి తనను ఏఎంసీ డైరెక్టర్‌గా నియ మించడంతో మరింత బాధ్యతగా పనిచేస్తానని ఏఎంసీ డైరెక్టర్ చింతల ప్రశాంత్ అన్నారు. శుక్రవారం మెలియాపుట్టి మండల కేంద్రంలో స్థానిక విలేకరులతో కలిసి మాట్లాడుతూ రైతులకు అందుబాటులో ఉంటానని, అలాగే క్షేత్ర స్థాయిలో జనసేన పార్టీ బలోపేతానికి మరింత కృషి చేస్తానన్నారు. ఈ నామినేటెడ్ పదవికి నాకు ఎంపిక చేయడంతో మరింత బాధ్యతగా పనిచేస్తా నన్నారు. ఏఎంసీ డైరెక్టర్‌గా నియామకానికి కృషిచేసిన స్థానిక శాసనసభ్యులు మామిడి గోవిందరావుకు, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, పాతపట్నం నియోజకవర్గం జనసేన పార్టీ నాయకురాలు కొరికాన భవాని, కూటమి నాయ కులకు, జనసేన పార్టీ నాయ కులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను జనసైనికులు దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు మండల నాయ కులు దుక్క బాలరాజు, నక్క గోపమ్మ దంప తులు, సత్యనారాయణ రాథో, చిన్నికృష్ణ, పత్రి మణికంఠ, జనం ఢిల్లీ, చరణ్, సింహాచలం తదితరులున్నారు.

## మధ్యాహ్న భోజన పథకం పరిశీలన

**జలుమూరు, ఆగస్టు 22 (వార్త):** ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా అమలు చేయాలని ఎంఈఓ ఎం. వరప్రసాదరావు ఆదేశించారు. జలుమూరులోని రాణ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. వంట ఏజెన్సీ సభ్యులు ఆహారం తయారు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. మెనూ ప్రకారం మాత్రమే భోజనం అందించాలని పేర్కొన్నారు. అనంతరం ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎం వరప్రసాదరావు జలుమూరు మండల కేంద్రంలోని స్థానిక కేజీబీవీ పాఠశాలను సందర్శించారు.





# హిరమండలం మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

**హిరమండలం/ఎల్ఎన్‌పేట, ఆగస్టు 22 (వార్త):** హిరమండలం మార్కెట్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం సుభలయ ఆర్ఆర్ కాలనీ సామాజిక భవనంలో నిర్వహించారు. మార్కెట్ కమిటీ కార్యదర్శి కె.ఆసిన్ సభ్యులతో పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్‌గా మామిడి రామక్రిష్ణారావు, వైస్ చైర్మన్‌గా కొవిలాపు క్రిష్ణమాచారి, డైరక్టర్లుగా పిరియా నాగేశ్వరరావు, కొల్ల రవీంద్రలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ రైతులకు ప్రయోజనం కలిగేలా సభ్యులు వ్యవహరించి కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. అలాగే ఉత్తరాంధ్ర జనసేన జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్, పాతపట్నం నియోజకవర్గ జనసేన నాయకురాలు కొరికాన భవాని, సుడా చైర్మన్ రవికుమార్ సహకారంతో ఏఎంసీ చైర్మన్‌గా జనసేన నాయకుడు మామిడి రామక్రిష్ణకు నియమించడం జరిగిందన్నారు. జనసేనా పార్టీ తరుపున వారికి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశానికి అన్నం పెట్టే రైతు సంక్షేమానికి కమిటీ సభ్యులు కృషి చేసి వారికి అండగా నిలబడాలన్నారు. అనంతరం సభ్యులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం నియోజకవర్గ కూటమి నాయకులు కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హిరమండలం ఏఎంసీ చైర్మన్‌ను కలిసిన సిరిపురం

నూతనంగా ప్రమాణస్వీకారం చేసిన హిరమండలం మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి రామకృష్ణ నివాసానికి శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. బిజెపి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్ అభివృద్ధి కోసం కృషిచేయాలని, రైతులు పండించిన వాణిజ్య పంటలకు స్థానికం గానే మార్కెటింగ్ సౌలభ్యం కల్పించాలన్నారు. ఆయన వెంట పాతపట్నం నియోజకవర్గం 5 మండలాల బీజేపీ నాయకులు, జిల్లా ఉపాధ్యక్షులు తాడేలా భూపతి, జిల్లా కార్యదర్శులు పనుకు సూర్యనారాయణ, కాపలా దమయంతి, పూర్వ ఉపాధ్యక్షులు దుక్క శ్రీకాంత్ రెడ్డి, పూర్వ జిల్లా కార్యదర్శి వలు రౌతుప్రసాద్, కొత్తూరు మండల అధ్యక్షులు బురడా భాస్కరరావు, హిరమండలం మండల అధ్యక్షులు రెళ్ల ఢిల్లీశ్వరరావు, ఎల్ఎన్‌పేట మండల అధ్యక్షులు మహంతి రవి, పాతపట్నం మండల అధ్యక్షులు పడాల షణ్ముఖరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహామూర్తి, పాతపట్నం మండల ప్రధాన కార్యదర్శి బడియాల బాబురావు, దారపు గోవింద్, హిరమండలం ప్రధాన కార్యదర్శి తిరుపతి, చల్లా ఈశ్వర్, పడాల తిరుపతిరావు, జనసేన నాయకులు మామిడి బాబ్జి తదితరులు ఉన్నారు.

# ఎంఈవో తీరుపై అసహనం

**ఎల్ఎన్‌పేట, ఆగస్టు22(వార్త):** ఉపాధ్యాయుల బదిలీ వీడ్కోలు సమావేశంలో తల్లిదండ్రులకు ఎంఈఓకు వాగ్వాదం చోటుచేసుకుంది. ఇటీవల కృష్ణాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల బదిలీ వీడ్కోలు సమావేశం జరిగింది. పాఠశాలలో ఇంతవరకూ పనిచేసి వేరే పాఠశాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను, ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు ఒక సమావేశం ఏర్పాటు చేసి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఇద్దరు మండల విద్యాశాఖాధికారులు, సమీప పాఠశాల ఉపాధ్యాయులు కూడా హాజరయ్యారు. సమావేశానికి వచ్చిన కొంతమంది తల్లిదండ్రులు అదే గ్రామానికి చెందిన మండలంలో అధికార పార్టీలో క్రియాశీలకంగా ఉన్న ఒక నేత తమ పాఠశాలలో ఏడు తరగతులకు ఇద్దరు ఉపాధ్యాయులను ఇచ్చారని, దీని వల్ల సక్రమంగా బోధన జరగడం లేదని, మండలంలో




మిగులు ఉపాధ్యాయులను గాని మినిమం టైం స్కేల్ ఉపాధ్యాయుడిని గాని ఈ పాఠశాలకు కేటాయించాలని ఎంఈవోను కోరారు. దీంతో ఆయనపై ఎంఈవో చిర్రుబుర్రులాడుతూ, ఎవరితో ఏం మాట్లాడాలో తెలియదా? ఏదైనా ఉంటే ఆఫీసుకు వచ్చి కలవండి అంటూ అక్కడ నుంచి ఎంఈవో లేచి వెళ్లిపోయినట్లు విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. అధికార పార్టీ నేత కూడా ఎంఈఓ వైఖరి చూసి అవాక్కయ్యారట.

# ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు





**కొత్తూరు, ఆగస్టు22 (వార్త):** కొత్తూరులో మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని ఘనంగా నిర్వహించారు. జూనియర్ చిరంజీవిగా పేరుపొందిన పొగిరి ధర్మ తేజ హాజరై అందరినీ అలరించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు.

**వీరఘట్టం:** తెలుగు సినీ పరిశ్రమలో తనదైన నటనతో ప్రజల హృదయాల్లో చెరగని ముద్రవేసిన మహానటుడు, సేవామూర్తి, బ్లడ్ బ్యాంక్ - ఐ బ్యాంక్ ల ద్వారా వేలాది ప్రాణాలకు నూతన జీవం ప్రసాదించిన మానవతా మూర్తి, పద్మవిభూషణ్ డా. మెగాస్టార్ చిరంజీవి జన్మదినోత్సవ వేడుకలను శుక్రవారం ఆడారు గ్రామంలో జనసైనికులు, మెగాస్టార్ అభిమానులు ఘనంగా నిర్వహించారు. జనసేన జానీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి వీరఘట్టం మండల కూటమి నాయుకులు మాచర్ల అనిల్ బాబు జనసేన నాయకులు సీరపు నాగరాజు, రఘుమండల గణేష్, గౌరి, ఆడారు గ్రామ మెగాస్టార్ అభిమానులు, జనసేన పార్టీ నాయకులు ఆడారు గ్రామ మాజీ: సర్పంచ్ మెరుగల సత్యం నాయుడు,ఆడారు గ్రామ కూటమి నాయకులు చోడి నారాయణ రావు ,చోడి గాంధీ, పేరాపు వెంకటరమణ, నెల్లి లక్ష్మనాయుడు, చౌడాడ వెంకట నాయుడు, జమ్మల సింహాద్రి, నీలాం స్వర్ణలత, నీలాం మోహన్ రావు, చోడి వెంకయ్య, చోడి కళ్యాణ్, అభిమానులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఎరువుల కొరత లేదు

**శ్రీకాకుళం, ఆగస్టు 22 (వార్త):** జిల్లాలో ఎలాంటి ఎరువుల కొరత లేదని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ స్పష్టం చేశారు. ఎరువుల పంపిణీపై పర్యవేక్షణ కోసం 9121863788 నంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు జిల్లాలో సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు రైతుసేవా కేంద్రాలు, వ్యవసాయ సహకార సంఘాలు ద్వారా 10,244 మెట్రిక్ టన్నులు, ప్రైవేట్ డీలర్ల ద్వారా 11,400 మెట్రిక్ టన్నులు, మొత్తంగా 21 వేల మెట్రిక్ టన్నులు రైతులకు సరఫరా చేశామని తెలిపారు. అంటే అవసరానికి మించి సుమారు 4 వేల మెట్రిక్ టన్నులు అదనంగా అందించామని పేర్కొన్నారు.

## గణేష్ మండపాలకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోండి

**నందిగాం, ఆగస్టు 22 (వార్త):** గణేష్ ఉత్సవాల నిర్వహణకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని నందిగాం ఎస్ఐ షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. దీనికి సంబంధించి ఎవరు ఎవరికి ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. నిబంధనలు మేరకు శాంతియుతంగా ఉత్సవాలు నిర్వహించి పోలీసులకు సహకరించాలని కోరారు.

## జనసేన కార్యాలయంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ

**ఇచ్ఛాపురం, ఆగస్టు 22 (వార్త):** జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన ఇంచార్జ్, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి రాజు ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నారు. సెప్టెంబర్ 2 వ తేదీన ఉప ముఖ్య మంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకొని ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు రాజు చెప్పారు. ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. నిరుద్యోగ యువత కోసం ప్రత్యేకంగా సెప్టెంబర్ 2 న ప్రారంభం కానున్న ఉచిత కంప్యూటర్ శిక్షణ ను ఉపయోగించుకొని, కంప్యూటర్ నైపుణ్యం సంపాదించుకోవాలని, ఈ శిక్షణ కాలం 45 రోజులు పాటు ఉంటుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి కాంటెక్ కంప్యూటర్స్‌చే సర్టిఫికెట్ కూడా ఇస్తామని చెప్పారు. ఈ సర్టిఫికెట్ కార్పొరేట్, కంపెనీల్లో, ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగం రీత్యా ఉపయోగపడుతుందని తెలిపారు. పదవ తరగతి పాస్ అయినా ఫెయిల్ అయిన , 18 ఏళ్ళు నిండిన ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట, కవిటి మండలాల యువతి యువకులు ఇచ్ఛాపురం జనసేన పార్టీ కార్యాలయంలో సంప్రదించాలని అన్నారు. వివరాలకు ప్రేమ్ కుమార్ 9705710798, శ్యాం సుందర్ 9908909513 నెంబర్లు కు సంప్రదించాలని కోరారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అన్వేష్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

**ఇచ్ఛాపురం, ఆగస్టు 22(వార్త):** వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర క్రిష్టియన్ మైనార్టీ సెల్ జనరల్ సెక్రటరీ ప్రత్తి అన్వేష్ కు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేశారు. ఆయన చేసిన అనేకమైన సామాజిక,సాంఘిక సేవలను గుర్తించి శ్రీకాకుళం జిల్లా పాస్టర్స్ క్రిస్టియన్ మినిస్ట్రీస్ వెల్ఫేర్ అసోసియేషన్, గ్లోబల్ ఇండిపెండెంట్ క్రిస్టియన్ ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో గౌరవ డాక్టరేట్‌తో సన్మానించారు. బిషప్ రెవ.డా.డానియేలు పాల్ చేతులు మీదుగా ఈ డాక్టరేట్‌ను అందుకున్నారు.బిషప్ గంజి. ఎజ్రా, బిషప్ కొత్తపల్లి అబ్రహాం, బిషప్ జాషువా, బిషప్ కిరణ్, బిషప్ ఏసుపాదం, బిషప్ పీటర్ పాల్గొన్నారు.



# ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

**-ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి**

**పోలాకి, ఆగస్టు 22(వార్త):** పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జరిగిన అడ్వైజరీ కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాత శిశు మరణాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని , ప్రభుత్వ ఆసుపత్రులలో మాత, శిశు మరణాలు కలగకుండా తగిన జాగ్రత్తలు వైద్య సిబ్బంది తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ప్రత్యేకంగా ఆసుపత్రికి వస్తున్న రోగులకు సరైన వైద్యం అందించడంతోపాటు వారితో మమేకమై సేవలు అందించాలని సూచించారు.వైద్య సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, హాస్పిటల్ సిబ్బంది అభ్యర్థించిన మీటింగ్ హాల్ నిర్మాణానికి పై అధికారులతో మాట్లాడి మీటింగ్ గా నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోలాకి వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ చైర్మన్ మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఏసియస్ ఛైర్మన్ బైరి భాస్కరరావ, పోలాకి సర్పంచ్, తాసిల్దార్, ఎంపీడీవో, డాక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.





## తాగునీరు వృధా.. పట్టించుకునే వారే లేరా?

(సారవకోట)

సారవకోట పురవీధుల్లో అందించే తాగునీరు నిత్యము వృధా అవుతున్న పట్టించుకునే వారు లేరని స్థానికులు వాపోతున్నారు. చుక్క నీటి కోసం ఎన్నో ఇక్కట్లు పడుతున్నా.. ఇలా తాగునీరు ఒక కొళాయి ద్వారా ఇంత వృధా అవుతుంటే, గ్రామంలో ఇలా ఎన్ని కొళాయిల ద్వారా ఎంత నీరు వృధా అవుతుందోనని విమర్శలు వినిపిస్తున్నాయి.

# వినాయక మండపాలకు ఆన్‌లైన్‌లో అనుమతులు: సీఐ



**నరసన్నపేట, ఆగస్టు 22(వార్త):** ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాలకు ప్రత్యేక వెబ్సైట్ ద్వారా అనుమతుల మంజూరు చేయబడతాయని నరసన్నపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు తెలియజేశారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గణేష్ మండప నిర్వాహకులు ganeshutsav.net వెబ్ సైట్ ద్వారా సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు పొందవచ్చునని సిఐ అన్నారు. ఈ అనుమతులకు ఎటువంటి రుసుములో చెల్లించి అవసరం లేదని, పోలీస్, ఫైర్, పంచాయితీ, రెవెన్యూ, శాఖల ద్వారా అనుమతులను తప్పనిసరిగా పొందాలని ఆయన వివరించారు. మండప నిర్వహకులు వినియోగించే మైక్ సెట్లు రాత్రి 10 గంటల తర్వాత వినియోగించకూడదని, నిమజ్జన సమయంలో నియమ నిబంధనలు పాటించాలని, డీజే ఏర్పాటు చేయడం, మందు గుండు సామగ్రికి బాణాసంచ కాల్చడం వంటివి నిషేధించినట్లు ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో నరసన్నపేట సబ్ ఇన్స్పెక్టర్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

## డ్రోన్‌తో నానో యూరియా పిచికారి




**జలుమూరు, ఆగస్టు 22 (వార్త):** చల్లవానిపేట గ్రామానికి చెందిన పంచ రెడ్డి రామచంద్రరావు పంట పొలంలో శుక్రవారం ప్రయోగాత్మకంగా డ్రోన్ సహాయంతో నానో యూరియా పిచికారి కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో నరసన్నపేట సహాయ సంచాలకులు ఎల్బీ మధు వ్యవసాయ అధికారి కింజరాపు రవి, పి వెంకట్రావు, పి రామారావు, బుక్క కామేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

# అర్ధసంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవం

**సరుబుజ్జిలి, ఆగస్టు 22(వార్త):** భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సంచార అర్ధసంచార విముక్త జాతుల విముక్తి దినోత్సవాన్ని పురస్కరించుకొని స్ఫూర్తి నినాదంతో సంచార జాతుల యొక్క సమస్యలను పరిష్కరిస్తూ వారికి కావలసిన సంక్షేమ పథకాలను చేరువ చేయడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని ఆగస్టు 30వ తేదీ విజయవాడ నందు నిర్వహించడం జరుగుతుందని శ్రీకాకుళం జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు గోవిందా రావు వివరించారు. అనంతరం కార్యక్రమం గోడ పత్రికలను ఆవిష్కరించారు. శ్రీకాకుళం జిల్లా బిజెపి ఉపాధ్యక్షులు గోవిందా రావు మాట్లాడుతూ, బ్రిటిష్ దుర్మార్గపు చట్టాల నుండి విముక్తి కలిగిన, గత పాలకుల నిర్లక్ష్యం వల్ల సంచార జాతుల ప్రజలు ప్రభుత్వ ఆదరణకు దూరంగా జీవించారని తెలిపారు. అంత్యోదయ లక్ష్యంతో ప్రధాని నరేంద్ర మోడీ సంచార జాతులకు స్థిర నివాసం, విద్యా అవకాశాలు, కళలకు గుర్తింపు ఇవ్వడం చేస్తూ డిఎన్టి కమిషన్ ఏర్పాటు చేసి సంక్షేమం ఆత్మగౌరవం వైపు పయనించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. సంచార జాతర యొక్క సమస్యలను తెలుసుకునేందుకు స్ఫూర్తి కార్యక్రమాన్ని రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు.



## 84 మంది దివ్యాంగులకు నోటీసులు

**వీరఘట్టం, ఆగస్టు 22(వార్త):** వీరఘట్టం మండలంలో 84 మంది దివ్యాంగుల పెన్షన్ దారులకు నోటీసులు అందజేసినట్లు ఎంపీడీవో బి.వెంకటరమణ శుక్రవారం తెలిపారు అలాగే ఒక పెన్షన్ నుండి మరో పెన్షన్‌కు కన్వెన్షన్ అయిన మరో 27 మందికి కూడా నోటీసులు అందజేసినట్లు ఆయన తెలిపారు అనర్హుల నోటీసు అందుకున్న దివ్యాంగుల పింఛనుదారులు ధ్రువపత్రాలు సమర్పించాలని తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల్లో తమ సిబ్బంది అందుబాటులో ఉంటారని వారికి తమ అర్జీతో పాటు ఆధార్ కార్డు జిరాక్స్ , పెన్షన్ రద్దు /పెన్షన్ మార్పు నోటీసు ,సదరం సర్టిఫికేటు (పాతది) , సదరం సర్టిఫికేట్ (కొత్తది),పింఛనుదారుకు సంబంధించిన ఏవైనా హాస్పిటల్ లో చికిత్స పొందిన/పొందుతున్న డాక్యుమెంట్స్ ఉంటే వాటిని సమర్పించాలని ఆయన తెలిపారు . పెన్షన్ దారులు అందజేసిన అర్జీని పెన్షన్ పోర్టల్లో అప్లోడ్ చేస్తామన్నారు ఏమైనా సందేహాలు ఉంటే గ్రామ వార్డు సచివాలయాల సిబ్బంది ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు



# అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించం

**- అధికారులకు మున్సిపల్ చైర్మన్ గిరిబాబు హెచ్చరిక**



**పలాస, ఆగస్టు 22(వార్త):** అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు హెచ్చరించారు. శుక్రవారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ రెండో వార్డ్ నెమలి నారాయణపురం గ్రామంలో సీసీ కాలువలు రెండు లక్షల రూపాయలతో అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపాలిటీలో శివరా ప్రాంతం కావడంతో నెమలి నారాయణపురం అభివృద్ధికి నోచుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు పరిపాలనలో 31 వార్డులో సమానమని, వార్డుల్లో వ్యత్యాసం లేకుండా పని చేస్తామని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ టి పి సి చైర్మన్ వజ్జ బాబురావు, టిడిపి నాయకులు సప్ప నవీన్, అంబటి కృష్ణమూర్తి, గాలి కృష్ణారావు, వార్డు పెద్దలు, మహిళలు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## జేసీఐ ఆధ్వర్యంలో జేసీ సాట్ స్కాలర్‌షిప్ పరీక్ష

**ఇచ్ఛాపురం, ఆగస్టు 22(వార్త):** జేసీఐ ఆధ్వర్యంలో విద్యార్థుల కోసం జేసీసాట్ స్కాలర్‌షిప్ పరీక్షను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీఐ ఇచ్ఛాపురం అధ్యక్షుడు కాళ్ల జైదేవ్ మాట్లాడుతూ, విద్యార్థులను చదువులో ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన యువతను గుర్తించడం, యువ ప్రతిభను పోషించడానికి ఇలాంటి పరీక్షలను ప్రతీ ఏటా నిర్వహిస్తున్నామని, ఇలాంటి అవకాశాలు యువతకు అపూర్వమైన వేదికలు అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని సమన్వయ కర్తలు స్నిగ్ధ, సిరిష, సంతోష్ సాహు నిర్వహించారు. జోన్ అధికారులు షన్ముఖ్, స్వరూప్ సహకారం అందించారు. సభ్యులు నవీన్, వెచ్చా వాసవి పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ప్రతిపాదనలు

**వీరఘట్టం, ఆగస్టు 22(వార్త):** జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి బి.రాజ కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

2025 విద్యా సంవత్సరానికి సంబందించి ప్రతిపాదనలు పంపించాలని ఆయన చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యం మినహా ఇతర యాజమాన్య సంస్థల క్రింద పనిచేస్తున్న ప్రాధమిక, ప్రాధమికోన్నత, ఉన్నత పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుల నుంచి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు 2025 పురస్కారాలకు ప్రతిపాదనలు కోరుతున్నామని తెలిపారు. కనీసం 10 సంవత్సరాలు ప్రభుత్వ ఉపాధ్యాయ సేవలు పూర్తి చేసి ఉండాలని చెప్పారు.

అర్హతల మేరకు జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రకటించడం జరుగుతుందని వివరించారు. ప్రతిపాదనలను ఈ నెల 26వ తేదీలోగా ఉప విద్యాశాఖాధికారి లేదా మండల విద్యాశాఖాదికారి కార్యాలయానికి అందజేయాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.



## డిజిపిని కలిసిన ఎమ్మెల్యే జయకృష్ణ

**వీరఘట్టం, ఆగస్టు 22(వార్త):** రాష్ట్ర రాజధాని అమరావతిలో డిజిపి హరీష్ కుమార్ గుప్తాను శుక్రవారం పాలకొండ నియోజకవర్గం శాసనసభ్యులు నిమ్మక జయకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గం లోని శాంతి భద్రతలపై డిజిపి ఆరా తీశారు. అలాగే తమ శాఖ అధికారుల పనితీరును కూడా అడిగి తెలుసుకున్నారు శాంతిభద్రతలకు భంగం లేకుండా ప్రజాప్రతినిధులు కూడా తమ పోలీస్ శాఖ కు సహకరించాలని డిజిపి సూచించారు. నియోజకవర్గంలోని పోలీస్ శాఖకు సంబంధించిన కొన్ని సమస్యలను డిజిపి దృష్టికి తీసుకెళ్లారు . ఇందుకు డిజిపి కూడా సానుకూలంగా స్పందించారు.

## ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్ పంపిణీ



**మందస, ఆగస్టు 22(వార్త):** మందస పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం చదువుతున్న ఎనిమిదవ తరగతి విద్యార్థులకు నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్(ఎన్ఎంఎంఎస్ స్టడీ మెటీరియల్) పంపిణీ చేశారు. పోటీ పరీక్షలకై అవసరమైన స్టడీ మెటీరియల్ ను ఇదే పాఠశాలలో 1990వ సంవత్సరంలో ఎస్ఎస్సీ చదువుకున్న కిల్లంశెట్టి కరుణ్ కుమార్ పూర్వ విద్యార్థుల సంఘం ద్వారా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు కిల్లంశెట్టి సత్యం, శిష్ట సోమనాథ్, ఉపాధ్యాయులు సురేష్ చంద్రపండ, దుర్గాప్రసాద్, కృష్ణారావు, వెంకట్ నారాయణ, భానుమతి, జ్ఞానేశ్వర్, ప్రసాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన శ్రావణ మాసోత్సవాలు



**ఇచ్ఛాపురం, ఆగస్టు 22(వార్త):** గ్రామ దేవత స్వేచ్ఛ వతి అమ్మవారి ఆలయంలో నెల రోజులు గా నిర్వహించిన శ్రావణ మాసోత్సవాలు ముగిశాయి.ఆఖరి శుక్రవారం ప్రత్యేక పూజలు అలంకరణ నిర్వహించారు.అభిషేకాలు సామూహిక లలితా సహస్ర పారాయణం నిర్వహించారు.లలితాంబిక బత్తుల వెంకట రమణ, శైలజ దంపతులు పూజలు నిర్వహించారు. లక్కీ డిప్ విజేతలు కు బహుమతులు అందజేశారు. జగన్నాథ స్వామి ఆలయం లో మహాలక్ష్మి అమ్మవారి కి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## వ్యక్తిగత పరిశుభ్రత కలిగి ఉండాలి

**పలాస, ఆగస్టు 22(వార్త):** పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా “మాన్సూన్ హైజిన్” అనే అంశంపై ఒక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. వెంకటలక్ష్మి అధ్యక్షతన, ఎన్ఎస్ఎస్ విభాగ కోఆర్డినేటర్ శ్రీ పి. మదు సమన్వయంతో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.బాబుజీ హాజరై, విద్యార్థులను ఉద్దేశించి వర్షాకాలంలో సాధారణంగా ఎదురయ్యే వ్యాధులు ు టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ, నీలవిరోచనాలు మొదలైన వాటి గురించి వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, కాచి వడపోసిన నీటిని సేవించటం, పోషకాహారాన్ని తీసుకోవడం వంటివి ఈ వ్యాధుల నివారణకు కీలకమని ఆయన వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎల్. గణపతిరావు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.వెంకటరమణ, సైన్స్ విభాగాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, లైబ్రేరియన్ బి.నరసింహులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం

**-ఎమ్మెల్యే గౌతు శిరీష**

**పలాస, ఆగస్టు 22(వార్త) :** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం పలాస ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ వినతదులపై తక్షణం స్పందిస్తూ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పరిష్కరించాలని కోరారు. ప్రజా దర్బార్ లో వికలాంగుల పెన్షన్లు తొలగించారని కొందరు ఎమ్మెల్యే గౌతు శిరీషకు విన్నవించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే, అర్హులకే పెన్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని, ముఖ్యమంత్రి కూడా ఈ విషయంపై స్పందించారని, తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. రోడ్లు, కాలువల నిర్మాణం వంటి కనీస వసతులపై అధికంగా విజ్ఞప్తులు వస్తున్నాయని, గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీస వసతులను కల్పించడంలో ఘోరంగా విఫలమైందని విమర్శించారు. గాంధీజీ కలలుగన్న గ్రామస్వరాజ్య స్థాపనకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, ప్రజలు, అధికారులు పాల్గొన్నారు.



## దోచుకోవడమే కూటమి ప్రభుత్వ నైజం



**వీరఘట్టం, ఆగస్టు 22(వార్త):** దోచుకోవడమే కూటమి ప్రభుత్వ నైజం అని, ప్రజల బాగోగులను గాలికి వదిలేసిన గాలి ప్రభుత్వమని, రాష్ట్ర వ్యాప్తంగా అర్హత ఉన్న దివ్యాంగుల పెన్షన్లను తొలగించడం వారి పరిపాలనకు ఇదే నిలువెత్తు నిదర్శనమని వైకాపా యువజన విభాగం అధ్యక్షులు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ పొట్నూరు లక్ష్మణరావు విమర్శలు గుప్పించారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నాలుగున్నర లక్షల పెన్షన్లను తొలగించిన ప్రభుత్వం దేశంలో ఏదైనా ఉందంటే అది కూటమి ప్రభుత్వం మే నని ఆయన అన్నారు. ప్రజలను, వికలాంగులను ఇబ్బంది పెట్టే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగుతుందని ఆయన అన్నారు. వికలాంగులు రోడ్లపైకి వచ్చి ధర్నాలు చేసే దుస్థితి వచ్చిందంటే ఈ కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం , సుపరిపాలన అని చంకలు గుద్దుకుంటుందే తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదని ఆయన ఎద్దేవా చేసారు. సుపరిపాలనకు తొలి అడుగు ఇదేనంటూ ప్రజలను మోసం చేస్తున్నారని ,వికలాంగుల్లో ఇబ్బంది పెట్టడం మీ సుపరిపాలనా అంటూ ఆయన నిలదీశారు. నిరుపేదలైన దివ్యాంగుల పెన్షన్లను పీకేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని ఆయన చెబుతూ, దివ్యాంగుల తరఫున వారికి అండగా నిలబడి రాష్ట్రవ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నాలు చేసేందుకు వెనుకాడబోమని ఆయన అన్నారు. ప్రభుత్వం ఇటువంటి మోసపూరిత కార్యక్రమాలకు స్వస్తి చెప్పి దివ్యాంగులకు అండగా నిలవాలని ఆయన అన్నారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

**-ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు**

**మందస, ఆగస్టు 22(వార్త):** సుదీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు కోరారు. ఏపీటీఎఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని సొండిపూడి, బైరిసారంగపురం, సిద్ధిగాం, పింపిడియా, హెన్నాలి, బెల్లుపటియా, సిరిపురం, పొత్తంగి, భోగాపురం, బొరంటా, పిల్లిబుడార్సింగి, కృష్ణాపురం, బుడార్సింగి పాఠశాలలను సందర్శించి, ఆయా ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకుంటూ, సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా ఉపాధ్యాయులు బోధనకు ఆటంకం కలిగించే అసెస్మెంట్ బుక్లెట్ విధానంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలో విద్యాశాఖాధికారులకు



ప్రాతినిధ్యం చేయనున్నారన్నారు.

పట్టులోగాం ఆశ్రమ పాఠశాల సమస్యపై తగు విచారణ జరిపి, సమస్యను పరిష్కరిస్తూ, ఆశ్రమంలో చదువుతున్న పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ లో ఉన్న డీఏలు విడుదల, పీఆర్సీ వర్తింపు, మధ్యంతర భృతి విడుదల, సీపీఎస్ ఉపాధ్యాయుల పెండింగ్ డీఏ బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం దృష్టి పెట్టాలన్నారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఏపీటీఎఫ్ మందస కార్యవర్గ సభ్యులు ఎన్.ఢిల్లేశ్వరరావు, డి.మోహనరావు, ప్రభాకర్ పట్నాయక్, వైకుంఠబెహరా, ఎస్.ఉదయ్, జగదీష్, డి.వైకుంఠ రావు, ఎన్.కరుణాకర్, ఎస్.నారాయణ రావు, వేణుగోపాల్, జగన్నాథం పాల్గొన్నారు.

## పారదర్శకంగా మన డబ్బులు-మన లెక్కలు



**మందస, ఆగస్టు 22(వార్త):** మహిళా స్వయంశక్తి సంఘాలన్నీ తమ పొదుపు, అప్పు పుస్తకాలతో పూర్తి లెక్కలు అంతర్గత ఆడిట్ ను పూర్తిచేసుకుని ప్రభుత్వం ఆన్లైన్ విధానంలో మన డబ్బులు-మన లెక్కలు అనే వెబ్సైట్ ద్వారా సంఘ సభ్యులందరికీ పారదర్శకంగా తమ సంఘం లెక్కలు తెలిసే విధంగా ఖచ్చితంగా పొందుపరచాలని వెలుగు ఐటిడిఏ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు అన్నారు. మందస పట్టణంలోని మండల సమాఖ్య కార్యాలయంలో సిబ్బంది సమీక్షా, శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతీ గ్రామ సంఘంలో అన్ని సంఘాలకు పూర్తిస్థాయిలో లెక్కలు వేయించి సభ్యులందరికీ వారి పొదుపు, అప్పుల లెక్కలు పూర్తిస్థాయిలో తెలియాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆ బాధ్యతను సంఘం బుక్ కీపర్, గ్రామ సంఘం ప్రతినిధులు, వి.వో.ఏ.తో పాటు సంబంధిత క్లస్టర్ కోఆర్డినేటర్లు బాధ్యత వహించాలని సూచించారు.

పంచ సూత్రాలు పాటిస్తున్న సంఘ సభ్యుల ఆదాయాభివృద్ధి కార్యక్రమాల కొరకు, ప్రతీ మహిళ ఒక ఎంటర్ప్రెనర్ గా తయారు కావాలన్న ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా అందరూ పని చేయాలని పిలుపునిచ్చారు. శ్రీనిధి, సీఐఎఫ్. రుణాలను బయోమెట్రిక్ విధానం ద్వారా యాక్టివిటీ చేసుకోబోతున్న మహిళలందరికీ ఇప్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీనిధి మేనేజర్ రాము, డేటా ఎంట్రీ ఆపరేటర్ రాజారావు, అకౌంటెంట్ కళ్యాణి, కృష్ణకుమారి, మండల సమాఖ్య ప్రతినిధి కాంతమ్మ, క్లస్టర్ కోఆర్డినేటర్లు, వి.ఓ.ఏ.లు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## బెల్లుపడ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో డైరీల పంపిణీ



**ఇచ్ఛాపురం, ఆగస్టు 22(వార్త):** బెల్లు పడా ఆదర్శ ప్రాథమిక పాఠశాల లో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశం లో మండల విద్యా శాఖ అధికారి కూరమన అప్పారావు ఆధ్వర్యం లో విద్యార్థుల సమగ్ర విద్యాభివృద్ధి నిమిత్తం డైరీలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎం ఈ వో మాట్లాడుతూ బెల్లుపడ పాఠశాల లో ఉపాధ్యాయులు అంకిత భావం తో పనిచేస్తున్నారని ,విద్యా ప్రమాణాల పెంపుదలకై చూపిస్తున్న చొరవ అభినందనీయమనీ కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ భవాని, ప్రధానో పాధ్యాయులు స్వర్ణరేఖ ,ఉపాధ్యాయులు రవికుమార్, ఆనంద్, దేవి, దేవరాజు, గ్రామపెద్దలు, సభ్యులు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా మెగాస్టార్ జన్మదిన వేడుకలు






**శ్రీకాకుళం, ఆగస్టు 22(వార్త) :** పద్మవిభూషణ్ , మెగాస్టార్ చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం అఖిల భారత చిరంజీవి యువత వర్కింగ్ ప్రెసిడెంట్ తైక్వాండో శ్రీను ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమం లో జివిఎన్వి జ్యూయలర్స్ యాజమాన్య ప్రతినిధి బోయిన పృధ్వీ, ఉత్తరాంధ్ర చిరంజీవి యువత కార్య దర్శి వైశ్యరాజు మోహన్, శ్రీకాకుళం న్యూ బ్లడ్ బ్యాంక్ మేనేజర్ మణికంఠ, మెగాస్టార్ చిరంజీవి అభిమా నులు, మెగా ఫ్యామిలీ హీరోల సంఘాల నాయకులు మజ్జి గౌతమ్, తైక్వాండో నవీన్, గొర్లె కిరణ్ కుమార్, జోగిపాటి వంశీ,శీర రాజు,పెయ్యల చంటి,కిరణ్ రెడ్డి ,కెల్ల గిరి, పంకు మురళీ,మహేష్ ,అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

**ఇచ్ఛాపురం, ఆగస్టు 22(వార్త):** మెగాస్టార్ చిరంజీవి 70 వ జన్మదిన వేడుకలు ను అభిమానులు ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు రొట్టెలు పంపిణీ చేశారు. డాక్టర్లు పి.దేవేంద్ర రెడ్డి, డాక్టర్ అనూషా చేతుల మీదుగా రోగులకు పండ్లు రొట్టెలు అందించారు. బంగ్లా రోడ్డు లో ఉన్న అన్నా క్యాంటీన్ లో నిరుపేదలకు అన్నదానం నిర్వహించారు. నిరుపేదలకు స్వయంగా వడ్డించారు.



కార్యక్రమం లో చిరు అభిమానులు అలీంఖాన్, అజయ్, దట్టీ శ్రీను,పుణ్యవాసులు, అజ్జు, .మోహన్, బావర్తీ రాజు, చందు, మున్నా, రఘు, భాస్కర్ , ఆది.అర్. వాసు పాల్గొన్నారు.జనసేన కార్యాలయం లో దాసరి రాజు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

**సరుబుజ్జిలి, ఆగస్టు 22(వార్త):** పెద్దపాలెం గ్రామంలో మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదిన వేడుకలు జిల్లా చిరంజీవి యువత ప్రతినిధులు బగ్గ అప్పలరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు సరుబుజ్జిలి జనసేన మండల పార్టీ అధ్యక్షులు పైడి మురళీమోహన్ సమక్షంలో అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు గ్రామ సర్పంచ్, ప్రధానోపాధ్యాయులు పంపిణీ చేశారు. అనంతరం స్కూలు, అంగన్వాడి ఆవరణలో కొబ్బరి, సపోటా మొక్కలు నాటారు. అనంతరం గ్రామ పెద్దలు వీర మహిళలు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అభిమానులు మండల ఉపాధ్యక్షులు తులగాపు ధనుంజయ్, ఆమదాలవలస మండల నాయకులు వీరఘట్టపు బాలమురళి, మిరాల మిన్నారావు, సతివాడ రామకృష్ణ, మూడడ్ల సత్య, భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

## గిరిజన భూములపై గిరిజనేతరుల దౌర్జన్యం



**మందస, ఆగస్టు 22(వార్త):**కొండలోగాం పంచాయతీ చాపరాయి కాలనీ గ్రామ పరిధిలో గవర్నమెంట్ భూమి(బీడీఆర్)లో గత 60 సంవత్సరాలుగా సవర మాధవ రావు, జిరాయతీ భూములు గల రైతులు ఎస్.జయరాజు, ఎస్.కూర్మారావు పాసు బుక్‌లతో అనుభవంలో ఉన్నప్పటికీ గిరిజనేతరులు దౌర్జన్యం చేస్తున్నారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. కొంతమంది గిరిజనుల భూమిలో జేసీబీ, ట్రాక్టర్లతో వచ్చి బలవంతంగా పోల్స్ పాతడానికి, భూమిని స్వాధీనం చేసుకోవటానికి ప్రయత్నించా రన్నారు. రెవెన్యూ డిపార్ట్ మెంట్, పోలీసుల సమక్షంలోనే జరిగిందన్నారు. సంఘ టనా స్థలంలో ఉన్న మందస మండల గిరిజన శక్తి సంక్షేమ సంఘం(ఎస్టీఎఫ్) అధ్యక్షుడు ఎస్.నరసింహులు, కార్యదర్శి ఎస్.హరికృష్ణ, ఉపాధ్యక్షుడు ఎస్.బాల కృష్ణ, నాయకులు ఎస్.లక్ష్మణరావు, జగ్గారావు, ఎస్.వల్లభరావు, ఎస్.జగ్గారావు, రామారావు తదితరులు భూరైతులకు అండగా ఉంటామని, అక్రమదారులకు ఎదుట నిలబడి వారి ప్రయత్నాన్ని అడ్డుకున్నామన్నారు. పాత పాస్ పుస్తకాలు పరిగణనలోకి తీసుకొని సర్వే చేయాలని వారు అధికారులను డిమాండ్ చేశారు.

## గ్రామస్థాయి నుంచి వైకాపా బలోపేతం



**మందస, ఆగస్టు 22(వార్త):** గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. బహడపల్లి పంచాయతీలో మండల పరిషత్ అధ్య క్షుడు డొక్కరి దానయ్య అధ్యక్షతన పంచాయతీ సర్పంచ్ ప్రతినిధి బొడ్డు ఉమాపతి ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఎంపీపీ దానయ్య మాట్లా డుతూ మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై సామాజిక మాధ్యమాల్లో టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను దీటుగా ఎదుర్కోవాలని కోరారు. అనంతరం పంచాయతీ కార్యవర్గాన్ని నియమించారు. పంచాయతీ అధ్యక్షునిగా మామిడి తులసయ్య, రైతు విభాగం అధ్యక్షునిగా సాలిన కృష్ణారావు, యువ జన అధ్యక్షునిగా మద్దిల జగదీశ్‌ను ఏకగ్రీ వంగా ఎన్నుకున్నారు.

## ముమ్మరంగా పారిశుధ్య పనులు



**జి.సిగడాం, ఆగస్టు 22(వార్త):** మద్రివలస గ్రామ పంచాయతీలో సర్పంచ్ విక్రం కోటిబాబు,పంచాయతీ కార్యదర్శి ఎన్.ఝాన్సీ ఆధ్వర్యంలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. కాలవల్లో చెత్తా చేదారాలుతో డ్రెయినేజీ నిండిపోవడంతో మనుషుల ద్వారా పూడికను మట్టిని తొలగించారు. కాలనీల్లో సైతం చెత్తను తొలగించారు. త్రాగు భావులు, వాటర్ ట్యాంక్ బోర్లవద్ద క్లోరినేషన్ చేశారు. కాలువల్లో బ్లీచింగ్ చల్లి దోమలు ప్రభలకుండా సాయంత్రం గ్రామ నలుమూలల్లో ఫాగింగ్ చేపట్టారు.

# కామ్రేడ్ ఢిల్లీరావు మృతి కార్మిక వర్గానికి తీరని లోటు

**పలాస, ఆగస్టు 22(వార్త):** కామ్రేడ్ ఢిల్లీరావు మృతి కార్మిక వర్గానికి తీరనిలోటని పలు ప్రజా సంఘ నాయకులు అన్నారు. శుక్రవారం బొడ్డపాడు గ్రామ వాస్తవ్యులు, విశాఖ స్టీల్ ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ ప్రధాన కార్యదర్శి, సిఐటియు నాయకులు డిల్లీ రావు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బి.ఆనందరావు, ఏఐసీసిటియు నాయకులు బొడ్డు వాసుదేవ రావులు మాట్లాడుతూ నేడు వారు తన కుటుంబాన్ని పరామర్శించారు. కార్మిక ఉద్యమానికే కాకుండా, పలు శ్రామిక, ఉద్యమాలలో పాల్గొని నవ సమాజ నిర్మాణం కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి డిల్లీ రావుఅని కొనియాడారు. క్రమశిక్షణకు, నిబద్ధతకు ఆయన రోల్ మోడల్ గా నిలిచారని వారు అన్నారు. ప్రజా ఉద్యమాలు నిర్వహించిన సందర్భంగా అనేక నిర్బంధాలకు, జైలు జీవితానికి గురయ్యారని వారన్నారు. ఎన్ని ఆటుపోటులు నిర్బంధాలు, వచ్చినా బెదరక ఉద్యమాల వైపు నికరంగా నిలబడిన కార్యకర్త అని వారు అన్నారు. ఆదాయం మార్గాలు అనేకం ఉన్నావాటిని కాదనుకొని, అనారోగ్య పరిస్థితులు చుట్టూ ముట్టినప్పటికి లెక్కచేయకుండా విప్లవమే తన వృత్తి అనుకుని పనిచేసిన మహా వ్యక్తి అన్నారు. తన తండ్రి విప్లవ వారసత్వం , బొడ్డపాడు విప్లవ వారసత్వం ఆయన మీద తీవ్ర ప్రభావమే చేసింది. నేడు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అవుతున్న ఈ నేపథ్యంలో ఆ ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన కామ్రేడ్ లేకపోవడం తీవ్ర లోటైనప్పటికీ, ఆయన విప్లవ వారసత్వంలో ఉన్న కార్యకర్తలు దాన్ని కొనసాగించడమే ఆయనకు మనం ఇచ్చే సరైన నివాళి అవుతుంది అన్నారు. ఆయన చిత్రపటానికి



పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఏపీసీఎల్సీ నాయకులు పి.దానేసు, ప్రజా సంఘాల నాయకులు ఎన్.మోహనరావు, బి.రామకృష్ణ, చంద్ర య్యా, వంకల అప్పయ్యు, బచ్చల పాపారావు, బొడ్డు సింహాద్రి, వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

## 25న జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలు


**శ్రీకాకుళం, ఆగస్టు 22(వార్త) :** శ్రీకాకుళంలోని టౌన్ హాల్ వేదికగా ఈ నెల 25న (సోమవారం) అండర్ -17 విభాగంలో జిల్లా స్థాయి ఫెన్సింగ్ పోటీలను నిర్వహించనున్నట్లుగా జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా) ఒక ప్రకటనలో తెలిపారు. బాలురు, బాలికలకి వేర్వేరుగా ఈ పోటీలను నిర్వహించనున్నట్లుగా పేర్కొన్నారు. డిసెంబరు 31,2025 నాటికి 17 యేళ్ళ వయస్సు ఉన్న ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకి చెందిన ఫెన్సర్లు మాత్రమే అర్హులని తెలియజేసారు. జనవరి 1,2009- డిసెంబరు 31,2012 మధ్య జన్మించిన బాలురు, బాలికలే ఈ పోటీలకు హాజరుకావాలని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచే వారికి ఫెన్సింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా జారీ చేసిన గుర్తింపు కార్డు తప్పనిసరని తెలియజేసారు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచే ఫెన్సింగ్ క్రీడాకారులను ఈ నెల 30వ తేదిన పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, వెస్ట్ బెర్రి స్కూల్ వద్ద జరిగే 11వ ఏపి స్టేట్ ఇంటర్ డ్రిస్టిక్ట్ అండర్ -17 బాలుర, బాలికల ఫెన్సింగ్ చాంపియన్ షిప్ 2025-26కి ఎంపిక చేయడం జరుగుతుందని తెలిపారు.



ఇతర వివరాలకి పెన్సింగ్ ఎన్ఐఎస్ కోచ్ జోగిపాటి వంశీని సెల్ నెంబర్‌లో 76608 74844 సంప్రదించాలని కోరారు.

# ఎన్టీఆర్ హౌసింగ్ లబ్ధిదారులు వెంటనే నిర్మాణాలు పూర్తి చేయాలి

**పలాస, ఆగస్టు 22(వార్త):** పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం నకు సంబంధించి కోసంగిపురం వద్ద గల రామకృష్ణాపురం లే-అవుట్ లో మన ఇల్లు మన గౌరవం ఎన్టీఆర్ హౌసింగ్ స్కీమ్ లో భాగంగా మంజూరైన 1966 లబ్ధిదారులకు గాను 600 మంది ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేశారని, మిగిలిన వారు తొందరలో పూర్తి చేయాలని పలాస మున్సిపల్ కమిషనర్ రామారావు కోరారు. రామకృష్ణాపురం లేఔట్ లో గల ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీలో కమిషనర్ వారు తమ సిబ్బందితో కలిసి శుక్రవారం పర్యటించి ఇండ్ల నిర్మాణాలకు సంబంధించిన




పరిస్థితులను గూర్చి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ వారు మాట్లాడుతూ మంజూరైన 1966 ఇండ్లకు గాను 600 ఇండ్లు మాత్రమే పూర్తికాబడినవి అని 860 ఇండ్లు స్లాబ్ లెవల్ వరకు వచ్చి ఆగి ఉన్నవని, 506 మంది ఇంకా ఇండ్ల నిర్మాణం పూర్తిగా మొదలు పెట్టలేదని తెలియజేశారు. ప్రభుత్వం వారు అదనంగా మంజూరు చేసిన అదనపు ఆర్థిక సహాయంతో ఇండ్ల నిర్మాణము లు పూర్తి చేయాలని, అదేవిధంగా స్టేజ్ అప్డేషనులను కూడా కొనసాగించాలని కోరారు. అదనపు ఆర్థిక సహాయం మంజూరైన వారు త్వరగా నిర్మాణము పూర్తి చేయనట్లయితే మంజూరైన అదనపు మొత్తము రికవరీ చేయబడుతుందని, ఇండ్లు కూడా రద్దు చేస్తామని తెలియజేశారు. రామకృష్ణాపురం లేఔట్ లో ప్రభుత్వం వారు ఇప్పటికే మౌలిక వసతులు కల్పించినదని, అందువలన ఇండ్లు మంజూరైన వాళ్లు ఇండ్ల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. సదరు లేఔట్ లో ప్రభుత్వము ఇప్పటికే మౌలిక సదుపాయంలు విద్యుత్, త్రాగునీరు కల్పించి ఉన్నారని, జాతీయ రహదారికి ఆనుకొని ఉన్నది కావున సదరు మంజూరైన ఇండ్ల లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని, ప్రభుత్వం వారు త్వరలో ప్రారంభించబోయే సామూహిక గృహప్రవేశాలకు అందరూ కూడా ఇండ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని కమిషనర్ కోరారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546